RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 452 | 18 మంగళవారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# బీఆర్ఎస్ చేతబడి చేయిస్తోంది..

## - సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు!



రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక హామీ ఇచ్చారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒక ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేస్తామని స్పష్టం చేశారు. సంగారెడ్డిలో శనివారం 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిందని, మరో 10 వేల పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని, యువత ప్రతిపక్షాల మాయలో పడకుండా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.

ఈ సందర్భంగా కొందరు మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసిన సీఎం, ఇది కేవలం కాగితం ముక్క కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవ కార్డు అని అన్నారు. గత ప్రభుత్వాలు దొడ్డు బియ్యం ఇచ్చి స్కామ్‌లు చేస్తే, తాము సన్నబియ్యం అందించి పేదల కడుపు నింపుతున్నామని తెలిపారు. బతుకమ్మ చీరల పేరుతో గతంలో నాసిరకం పంపిణీ చేస్తే, తాము పాలపిట్ట, చిలకపచ్చ రంగు చీరలతో మహిళల గౌరవం పెంచామని తెలిపారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ బాగుపడకూడదని, రాష్ట్రంలో కరువు రావాలని కోరుకుంటూ బీఆర్ఎస్ నేతలు చేతబడులు, అఘోర పూజలు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటక, తమిళనాడు ఆలయాల్లో అర్ధరాత్రి చేసిన పూజల రహస్యాన్ని బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తాము మంజూరు చేసిన 7 లక్షల ఇందిరమ్మ ఇళ్ల గ్రామాల్లోనే ఓట్లు అడుగుతామని, బీఆర్ఎస్ వారు కట్టిన డబ్బా ఇళ్ల వద్ద ఓట్లు అడగగలరా? అని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. రాహుల్ గాంధీ రాముడైతే, జగ్గారెడ్డి హనుమంతుడని కొనియాడారు. అనంతరం నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు.

## రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది

### : హరీశ్ రావు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి నివాసానికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్య ప్రజల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో విచారణ జరపాలని, ఆ జాబితాలో ఉన్న ఆస్తులు పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆయన విమర్శించారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లను నీరుగార్చే కుట్ర

### : రేవంత్ ప్రభుత్వంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం




తెలంగాణలో పేదల సంక్షేమానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ పథకాలను యథాతథంగా కొనసాగించాలని, అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భరత్ కుమార్ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన భారీ ధర్నాలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ పథకాలపై కోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసి కూడా, కావాలనే ప్రభుత్వం తరఫున సరైన వాదనలు వినిపించకుండా కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు వచ్చేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉన్నప్పటికీ, ఈ సంక్షేమ పథకాలను నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతుండటం విచారకరమన్నారు. అలాగే నల్గొండ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుని అనర్హులకు ఇచ్చారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొంది. జాయింట్ కలెక్టర్ మెమోరాండం స్వీకరించేందుకు రాగా బీఆర్ఎస్ నాయకులు ఇచ్చేందుకు నిరాకరించారు. చివరకు గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌ను కలవడానికి పోలీసులు అనుమతించడంతో, నాయకులు కలెక్టర్‌ను నేరుగా కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు.

## 22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు..

### ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరిక



22ఏ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేటు భూములు చేరుతున్న అంశంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. 22ఏను అడ్డుపెట్టుకుని ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతోనే దరఖాస్తును తిరస్కరించవద్దని మంత్రి సూచించారు. అసలు ఆ భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో పరిశీలించాలని చెప్పారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములను కాపాడాలని సూచించారు. నిషేధిత భూముల అంశంపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులు, ఫిర్యాదులపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు త్వరలో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. 22ఏ భూముల విషయంలో నిబంధనల పేరుతో ప్రజలకు అనవసర ఇబ్బందులు కలిగించకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

### : ఉత్తమ్



స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఇంటికి వచ్చి ఉరికించి కొడతాం

### : బీజేపీ ఎంపీ అరవింద్‌కు కాంగ్రెస్ హెచ్చరిక



నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌పై అరవింద్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. తన వైఖరి మార్చుకోకపోతే ఇంటికి వచ్చి ఉరికించి కొడతామని ఘాటుగా హెచ్చరించారు. శనివారం గాంధీ భవన్‌లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేషన్ల ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, మెట్టు సాయికుమార్ సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, అరవింద్ తన నోటి దురుసును అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. ఎన్ఎస్‌యూఐ స్థాయి నుంచి కష్టపడి పైకొచ్చిన బీసీ బిడ్డ మహేశ్ కుమార్ గౌడ్‌ను విమర్శించే స్థాయి అరవింద్‌కు లేదని మండిపడ్డారు. తండ్రి పేరును వాడుకుని రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్, స్వయంకృషితో ఎదిగిన నాయకులను విమర్శించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు ఎక్కడ తెచ్చారో, గల్ఫ్ బాధితుల సంక్షేమం కోసం ఏం చేశారో అరవింద్ స్పష్టం చేయాలని అనిల్ డిమాండ్ చేశారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుంటే, అరవింద్ కేవలం విమర్శలు చేయడానికే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. డీఎస్ కుటుంబానికి వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. సాయికుమార్ మాట్లాడుతూ, అరవింద్ మాటలు మద్యం దుకాణాల వద్ద తాగుబోతుల మాట్లాడే తీరులో ఉన్నాయని విమర్శించారు. దమ్ముంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి కౌన్సిలర్‌గా గెలిచి చూపాలని సవాల్ విసిరారు. "ఇంకోసారి హద్దు మీరితే ఇంటికి వచ్చి మరీ గుణపాఠం చెబుతాం" అని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తన పార్టీ నాయకులను అదుపులో ఉంచుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in



# పెబ్బేరు మున్సిపాలిటీని మురికిపాలిటీగా చేస్తున్న నాయకులు

## మున్సిపాలిటీకి పన్నులు కట్టిన పంగనామాలు మాత్రం తప్పడం లేదు .

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి లక్ష్మీనారాయణ పెబ్బేరు మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు దూరంగా ఉంది. ఏళ్లు గడుస్తున్నా కొని వార్డులో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల మధ్యలోకి చేరుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో దోమలు, ఈగలు పెరిగి ప్రజలు రోగాల బరిన పడుతున్నారు. తాగునీటి సమస్య కూడా కొన్ని వార్డులో ప్రజలను వేధిస్తోందని స్థానికులు చెబుతున్నారు. వీధి దీపాలు సరిగా లేక రాత్రి వేళల్లో రాకపోకలకు ప్రమాదకరంగా మారుతున్నాయని అంటున్నారు. చిన్న వర్షానికే రోడ్లు బురదమయంగా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు సైతం వెళ్లేందుకు ఇబ్బందులకు గురైతున్నామని చెబుతున్నారు.

తమ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డులో పారిశుద్ధ్యంపై కూడా ప్రత్యేక




దృష్టి పెట్టాలని, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

# సమీకృత జిల్లా కార్యాలయం ప్రజావాణికి 136 ఫిర్యాదులు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 17:-

రంగారెడ్డి జిల్లా: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 136 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవికి వివరించి వినతిపత్రాలను సమర్పించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, ప్రభుత్వ పథకాలు, పౌర సేవలు, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో శారదాదేవి సూచించారు. ప్రజావాణి ద్వారా అందే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆమె ఆదేశించారు. ప్రజలకు సకాలంలో సేవలు అందించడంతో పాటు సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను సంబంధిత అధికారులు నమోదు చేసి, ఉన్నతాధికారులకు నివేదిక అందించాలని సూచించారు.

సోమవారం జరిగిన ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 60 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించి 76 ఫిర్యాదులు అందాయి. మొత్తం 136 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ



కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తుర్కయంజాల్‌లో అక్రమ నిర్మాణాల జోరు,

## కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 17:-

ఆదిభట్ల: ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్థానిక సంస్థల నుంచి అవసరమైన అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, కొందరు నిబంధనలను పక్కనపెట్టి యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన తర్వాత అధికారులు చర్యలు తీసుకుంటారా? లేక ముందుగానే అడ్డుకుంటారా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయనే సమాచారం అధికారుల దృష్టికి వస్తున్నా క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎందుకు చేపట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో పట్టణ ప్రణాళిక సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తుర్కయంజాల్, తొర్రూర్ ప్రాంతాల్లో సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, నిర్మాణాలకు




అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# గురుకుల పాఠశాలలో జెండా వివాదం.. విచారణకు బీజేపీ ఫిర్యాదు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 17:-

రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లోని కమ్మగూడ మైనారిటీ గురుకుల పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాకు అవమానం జరిగిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిని కోట్ల నవీన్ కుమార్ రెడ్డికి ఫిర్యాదు అందజేశారు. బీజేపీ జీహెచ్ఎంసీ 53, 56 డివిజన్ల అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి, బచ్చిగల రమేష్ కొత్త రాంరెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 15న పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులతో జాతీయ త్రివర్ణ పతాకానికి బదులుగా ఆకుపచ్చ రంగు జెండాతో ర్యాలీ నిర్వహించారని ఆరోపించారు. జాతీయ పతాక వినియోగానికి సంబంధించిన నిబంధనలను పాఠశాల యాజమాన్యం పాటించిందా లేదా అనే అంశంపై అధికారికంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల రోజువారీ కార్యక్రమాల్లో 'వందేమాతరం' బోధించడం లేదని వారు ఆరోపించారు. పాఠశాలలో జెండాల



వినియోగం, జాతీయ గీతాలు, దేశభక్తి కార్యక్రమాల నిర్వహణపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరారు. ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా జరిగితే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండ కృష్ణ, సురేష్, నందగిరి రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ ఆందోళన

## దిష్టిబొమ్మ దహనానికి యత్నం.. వినయ్ భాస్కర్ అరెస్టు

హనుమకొండ, ఆగష్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: వరంగల్ జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మహిళలు, నాయకులు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఆందోళనలో మాజీ మంత్రి వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వినయ్



భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి వినయ్ భాస్కర్‌ను



అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో కలెక్టరేట్ పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి లక్ష్యం

## గీసుకొండలో 8 అర్జీలు స్వీకరణ..

### పంచాయతీ భూమి పరిరక్షణకు వినతి

గీసుకొండ, ఆగష్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీఓ వెన్న కృష్ణవేణి, తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్ తెలిపారు.




గీసుకొండ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎనిమిది అర్జీలను అధికారులు స్వీకరించారు. అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ కృష్ణవేణి తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరియపురం గ్రామానికి చెందిన రాంపిస మదన్‌మోహన్ గ్రామపంచాయతీకి సంబంధించిన భూమి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. పంచాయతీ భూమికి సంబంధించి తగిన చర్యలు తీసుకుని పరిరక్షించాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి హరి ప్రసాద్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, పశు వైద్యాధికారి జి.శ్రీనివాస్, ఏఈలు రాజు, సందీప్, మండల విద్యాశాఖ అధికారి రవీందర్, సూపరింటెండెంట్ కమలాకర్ తదితరులు, పంచాయతీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 17:-

ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులు నోటీసు జారీ చేశారు. ఆదిభట్ల సర్కిల్15, శంషాబాద్ జోన్,



జీహెచ్ఎంసీ పరిధిలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా పరిశీలనకు అందుబాటులో ఉంచనున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని 123 నుంచి 138 వరకు, 199 నుంచి 206 వరకు, 208 నుంచి 279 వరకు ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లు తమ పేర్లు, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. 2026 ఓటర్ల జాబితా సవరణకు అక్టోబర్ 1, 2026ను అర్హత తేదీగా నిర్ణయించారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినా, కొత్తగా పేరు చేర్చుకోవాలన్నా, ఇప్పటికే ఉన్న పేరులో వివరాలను సరిచేయాలన్నా, లేదా అనర్హుల పేర్లపై అభ్యంతరాలు ఉన్నా సెప్టెంబర్ 16లోపు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం పేరు చేర్పునకు నమూనా6, పేరు తొలగింపునకు నమూనా7, వివరాల సవరణకు నమూనా8 ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తిచేసుకునే యువత కూడా ముందస్తుగా పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటర్ల జాబితాను పరిశీలించి, అవసరమైన మార్పులు ఉంటే నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ పథకం కొనసాగించాలని!

## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

హైదరాబాద్ ఎస్టేట్ 17ఆగష్టు మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ



మందమర్రి మండలం, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వీ=ా కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజా రమేష్ మరియు చైర్ పర్సన్ డాక్టర్ సంధ్యా రాణి మాట్లాడుతూ తెలంగాణ బాపు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేరును మరియు పథకాలను చెరపలేరు పేదల మనసుల్లో నుంచి తొలగించలేరు అని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ తులం బంగారం ఇచ్చే దమ్ము లేదు కానీ కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయాలని చూడటం సిగ్గు మాలిన చర్య అని అన్నారు. ఓటుకు నోటు దొంగ, భూ కబ్జా దారుడు రేవంత్ రెడ్డి ప్రజల పైసలు దోచుకునుడు డిల్లీ కి పబ్బం కట్టుడు తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదని ఎద్దేవ చేశారు. 420 హామీలు, 6 గ్యారెంటీలు మరచి 3సంవత్సరాలు కావస్తుంది, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. మీకు దమ్ము దైర్యం ఉంటే ప్రజల కోసం ఇక్కొన్ని కొత్త పథకాలను ప్రవేశ పెట్టాలి కానీ, ఒక్కొక్కటిగా అన్ని వర్గాల ప్రజల్ని మోసం చేసుకుంటూ వారి కి ప్రభుత్వం నుండి వచ్చేటువంటి పథకాలను నిలిపివేస్తు ఆటో డ్రైవర్ అన్నల బ్రతుకులని ఆగం చేస్తూ వారి మరణానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. ఇటు రైతులను మహిళలను యువకులను నిరుద్యోగులను విద్యార్థులను ఏ వర్గాన్ని వదలకుండా అన్ని వర్గాలకు అన్యాయం చేస్తూ వారి బలత్ మరణానికి కారకులైన కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రాన్ని పరిపాలించే నైతిక హక్కు లేదని, ఒక్క వేళ ఇలా చేసుకుంటూ పోతే రానున్న రోజుల్లో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్ద దించేందాక పోరాడుతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్మన్ పర్సన్ సంధ్యారాణి, చెన్నూర్ నియోజకవర్గ నాయకులు డా రాజారమేష్, కౌన్సిలర్స్ భూమన్న గౌడ్, బబ్బెర స్వర్ణలత, క్యాతన్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుదర్శన్ గౌడ్ , రామిడి కుమార్, అనిల్ రావు, ఆర్నె సతీష్, జక్కన్బోయిన కుమార్, వేముల వెంకటేశం, రెవెల్లి ఓదెలు, జిలకర మహేష్ ,వంశీ కృష్ణ, శరత్, రమేష్ రెడ్డి, రామిడి లక్ష్మీకాంత్, రజియా, రాజేశ్వరి, జనా శేఖర్, కొండ కుమార్, క్రాంతి, మందమర్రి పట్టణ నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in

# జూకల్ జ్ఞానదీపం.. నాలుగు దశాబ్దాల విద్యా ప్రస్థానం

## - శ్రీ నూనె రాజయ్య సార్ ఆశయాలకు వారసుడిగా నరేందర్ సార్.. లక్ష్మీ విద్యానికేతన్ విజయ పథంలో

## - 44 ఏళ్ల ఘన చరిత్ర.. 45వ వసంతంలోకి అడుగులు। గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు





హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

జూకల్: ఒక గ్రామంలో విద్యా వెలుగులు నింపాలనే సంకల్పంతో వెలిగించిన చిన్న దీపం.. నేడు
వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞానజ్యోతిగా మారింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఆధునిక విద్య అందించాలనే మహోన్నత ఆశయంతో కీర్తిశేషులు శ్రీ నూనె రాజయ్య సార్ 1982లో జూకల్ గ్రామంలో స్థాపించిన లక్ష్మీ ట్యుటోరియల్ పాఠశాల, కాలక్రమంలో లక్ష్మీ విద్యానికేతన్ ప్రాథమికోన్నత పాఠశాలగా రూపాంతరం చెంది 44 ఏళ్ల సుదీర్ఘ విద్యా ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఇప్పుడు 45వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పాఠశాల చరిత్ర, వారసత్వం, భవిష్యత్ ప్రస్థానం ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

ఒక ఆశయం.. ఒక ఆలోచన.. ఒక విద్యా విప్లవం

1982లో గ్రామీణ ప్రాంత పిల్లలకు మెరుగైన విద్య అందుబాటులో ఉండాలనే దూరదృష్టితో శ్రీ నూనె రాజయ్య సార్ లక్ష్మీ ట్యుటోరియల్ పాఠశాలకు శ్రీకారం చుట్టారు. విద్యను కేవలం పుస్తక జ్ఞానంగా కాకుండా.. క్రమశిక్షణ, విజ్ఞానం, సంస్కారం, విలువలతో కూడిన జీవన విధానంగా అందించాలన్నది ఆయన లక్ష్యం.
ఆయన పట్టుదల, సేవాభావం, విద్యపై ఉన్న మమకారం పాఠశాల ఎదుగుదలకు బలమైన పునాదులుగా నిలిచాయి. ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూనే పాఠశాలను అభివృద్ధి చేస్తూ గ్రామస్తుల మన్ననలు పొందారు.

వేలాది భవిష్యత్తులకు పునాది

లక్ష్మీ విద్యానికేతన్‌లో విద్యను అభ్యసించిన అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. పాఠశాలలో పనిచేసిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ వారి ప్రతిభను వెలికితీశారు.విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించడం, ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దడం పాఠశాల ప్రత్యేకతగా నిలిచింది. దీంతో లక్ష్మీ విద్యానికేతన్ పేరు జూకల్ గ్రామానికే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ మార్మోగింది.

కరోనా కష్టకాలంలో తీరని లోటు

విద్యా సేవకుడిగా, క్రమశిక్షణకు మారుపేరుగా, ఎందరికో మార్గదర్శిగా నిలిచిన కీర్తిశేషులు శ్రీ నూనె రాజయ్య సార్ 2021 ఏప్రిల్ 11న కరోనా మహమ్మారి బారిన పడి తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం కుటుంబానికే కాకుండా పాఠశాల కుటుంబానికి, జూకల్ గ్రామానికి తీరని లోటుగా మారింది.ఒక మహోన్నత ఆశయంతో నిర్మించిన విద్యాలయ భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళన నెలకొన్న సమయంలో.. తండ్రి ఆశయాన్ని నిలబెట్టుకోవాలన్న సంకల్పంతో ఆయన కుమారుడు శ్రీ నూనె నరేందర్ సార్ ముందుకు వచ్చారు.

తండ్రి ఆశయానికి తనయుడి వారసత్వం

2021 జూలైలో పాఠశాల కరస్పాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నరేందర్ సార్.. పాఠశాలను కేవలం కొనసాగించడమే కాకుండా ఆధునికత వైపు పరుగులు పెట్టించారు.సాంకేతిక పరిజ్ఞానంపై తనకున్న అవగాహనను ఉపయోగిస్తూ విద్యా విధానంలో అనేక మార్పులు తీసుకొచ్చారు. ముఖ్యంగా కరోనా కాలంలో ఆన్‌లైన్ విద్యా విధానాన్ని మండలంలో తొలిసారిగా ప్రవేశపెట్టే ప్రయత్నం చేసి విద్యార్థులకు విద్యా అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. తన నిర్ణయాలు, పనితీరు, మార్పుల ద్వారా పాఠశాలను కొత్త దిశగా తీసుకెళ్లే సామర్థ్యాన్ని అనతికాలంలోనే నిరూపించుకున్నారు.

ఆధునిక సాంకేతికత.. నాణ్యమైన విద్య

ప్రస్తుత విద్యా అవసరాలకు అనుగుణంగా పాఠశాలలో సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నారు. ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులపై శిక్షణ అందిస్తూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో సమర్థవంతంగా వినియోగించేలా ప్రోత్సహిస్తున్నారు.

విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సువిశాలమైన తరగతి గదులు, కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం వంటి సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు.

విద్యతో పాటు విజ్ఞానం, వినయం, క్రమశిక్షణ, విలువలు విద్యార్థుల్లో పెంపొందించేలా పాఠశాల వాతావరణాన్ని తీర్చిదిద్దుతున్నారు.

విద్యాలయం దేవాలయం..
విద్యార్థులే భవిష్యత్తు

విద్యాలయాన్ని దేవాలయంగా భావిస్తూ.. ప్రతి విద్యార్థి భవిష్యత్తును తన బాధ్యతగా స్వీకరించి పనిచేస్తున్న నరేందర్ సార్ సేవలు అభినందనీయం.

పిల్లల పసి హృదయాలను అర్థం చేసుకుని, వారి ప్రతిభను గుర్తించి, నవీన సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పాఠశాల ముందుకు సాగుతోంది.

తండ్రి శ్రీ నూనె రాజయ్య సార్ ప్రారంభించిన విద్యా యజ్ఞాన్ని కుమారుడు నూనె నరేందర్ సార్ అదే ఆశయంతో కొనసాగిస్తూ.. కాలానుగుణ మార్పులను స్వీకరిస్తూ ముందుకు తీసుకెళ్తుండటం ఈ పాఠశాల వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది.

45వ సంవత్సరంలోకి అడుగులు.. మరిన్ని విజయాలకు సంకల్పం

44 ఏళ్ల చరిత్రను పూర్తి చేసుకుని 45వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న లక్ష్మీ విద్యానికేతన్ ప్రాథమికోన్నత పాఠశాల భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిద్దాం
.
ఒకప్పుడు శ్రీ నూనె రాజయ్య సార్ నాటిన విద్యా మొక్క.. నేడు మహావృక్షంగా ఎదిగి అనేకమంది విద్యార్థులకు నీడనిస్తోంది. రాబోయే తరాలకు మరింత నాణ్యమైన విద్యను అందిస్తూ.. జూకల్ గ్రామ విద్యా చరిత్రలో తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని కోరుకుందాం.

మన బడి.. మన భవిష్యత్తు
మన పిల్లల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది.

మన మంచి ఆలోచన.. వారి రేపటి జీవితానికి పునాది అవుతుంది.

మన పాఠశాల అభివృద్ధి.. మన గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తుంది.

లక్ష్మీ విద్యానికేతన్ అభివృద్ధి కోసం అందరం కలిసి అడుగులు ముందుకు వేద్దాం.
మన పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దాం.

మన బడి మన భవిష్యత్తు.
మన విద్య మన బలం.
మన పిల్లల విజయం మన గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల గర్వం.

# రజకుల ఉచిత విద్యుత్ బకాయిలు చెల్లించాలి

## బకాయిల భారం వృత్తిదారులపై పడకుండా చూడాలి

## ఐలోని అభిషేక్



వరంగల్, ఆగస్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: రజక వృత్తిదారులకు అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి వృత్తిదారులకు ఊరట కల్పించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఐలోని అభిషేక్ డిమాండ్ చేశారు. పథకాన్ని ప్రభుత్వం కొనసాగిస్తున్నప్పటికీ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో వృత్తిదారులపై వేలాది రూపాయల బిల్లుల భారం పేరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడం పట్ల అభిషేక్ ధన్యవాదాలు తెలిపారు. అయితే పథకం కింద ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు పేరుకుపోవడం వల్ల వృత్తిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ పథకం ఉద్దేశం వృత్తిదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించడమేనని, బకాయిల కారణంగా అదే భారం తిరిగి వృత్తిదారులపై పడే పరిస్థితి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తిదారులకు అమలవుతున్న ఈ పథకానికి సంబంధించిన బకాయిల సమస్యను ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించడంతో పాటు ఇకపై పథకం కింద విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించేలా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని కోరారు. రజక వృత్తిదారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ఉచిత విద్యుత్ పథకాన్ని నిరంతరాయంగా అమలు చేయాలని ఐలోని అభిషేక్ కోరారు.

# యూసుఫ్ పేటలో ఘనంగా నాగుల పంచమి వేడుకలు




మెదక్,ఆగస్టు17 (హైద్రాబాద్ ఎస్టేట్): పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో సోమవారం రోజు నాగుల పంచమి సందర్భంగా మహిళలు రాజిరెడ్డి అమ్మవారు లక్ష్మినర్సమ్ నిర్మించిన నాగులమ్మ గుడిలో యూసుఫ్ పేట,అరెపల్లి గ్రామాలకు చెందిన భక్తులు ఉదయాన్నే పూజలు,అర్చన కార్యక్రమాలు నిర్వహించారు.అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, కొబ్బరికాయలు పాలతో అభిషేకం చేశారు.ఆలయ పూజారి మంగలి అరవింద్ పూజలు నిర్వహించగా, ఈకార్యక్రమంలో తీగల అంజగౌడ్,సంగారెడ్డి పేట యాదమ్మ,తీగల అవనమ్మ, తీగల రామ గౌడ్,తీగల సంగీత,ఉబిది నర్సింలు (డిగ్రీ),విక్రమ్ రెడ్డి,సంజీవ రెడ్డి,గడ్డమీద సంగ్రాశీ, తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ సంఘానికి నూతన కార్యవర్గం

## - జాన పీరిలులో సామాజిక చైతన్యానికి పెద్దపీట



వరంగల్, ఆగస్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: జాన పీరిలు 17వ డివిజన్ పరిధిలో అంబేడ్కర్ సంఘాన్ని నూతనంగా ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు సామాజిక సమానత్వం, చైతన్యం, ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానికంగా ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా సంఘం పనిచేయాలని పేర్కొన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా దక్క ప్రభాకర్, అధ్యక్షుడిగా ఈసంపెల్లి కరుణాకర్, కార్యదర్శిగా ఈసంపెల్లి సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా నార్మట మైకేల్, కోశాధికారిగా ఈసంపెల్లి సాల్మన్, ప్రచార కార్యదర్శిగా ఈసంపెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దక్క జయరాజు, నార్మట రమేష్, ఈసంపెల్లి చందు, నార్మట రెమో, కొడకండ్ల రమేష్, మంద మొగిలి, కొడకండ్ల సునీల్, గాదె ప్రవీణ్, కొమ్ముల టోనీ, ఈసంపెల్లి సృజన్, జన్ను రాజు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి రాష్ట్ర అంబేడ్కర్ సంఘం కార్యవర్గ సభ్యుడు కొమ్ముల సురేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు సందెల సునీల్, మాదాసి బిక్షపతి, పోతారాజుపల్లి మాజీ సర్పంచ్ మంద బాబురావు, మాల మహానాడు జిల్లా నాయకుడు డాక్టర్ తుప్పరి నరసింహస్వామి, మనుగొండ మాదాసి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాన పీరిలు అంబేడ్కర్ నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందెల సునీల్‌ను ఎన్నుకోగా, సభ్యులుగా దక్క ప్రభాకర్, మాదాసి రాంబాబు, మంద బాబురావు, మాదాసి బిక్షపతి, కొమ్ముల సురేందర్, డాక్టర్ నరసింహస్వామిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలని, విద్యార్థులు, యువతలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులు ఆకాంక్షించారు. అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో చూపిస్తూ సంఘాన్ని ప్రజలకు అందుబాటులో ఉండే వేదికగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

# అంబేడ్కర్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా ఈసంపెల్లి కరుణాకర్.. కార్యదర్శిగా ఈసంపెల్లి సాంబయ్య



వరంగల్, ఆగస్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: జనపీర్‌యిల్ 17వ డివిజన్ పరిధిలో అంబేడ్కర్ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దక్క ప్రభాకర్, అధ్యక్షుడిగా ఈసంపెల్లి కరుణాకర్, కార్యదర్శిగా ఈసంపెల్లి సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా నార్మట మైకేల్, కోశాధికారిగా ఈసంపెల్లి సాల్మన్, ప్రచార కార్యదర్శిగా ఈసంపెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దక్క జయరాజు, నార్మట రమేష్, ఈసంపెల్లి చందు, నార్మట రెమో, కొడకండ్ల రమేష్, మంద మొగిలి, కొడకండ్ల సునీల్, గాదె ప్రవీణ్, కొమ్ముల టోనీ, ఈసంపెల్లి సృజన్, జన్ను రాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర అంబేడ్కర్ సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొమ్ముల సురేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు సందెల సునీల్, మాదాసి బిక్షపతి, పోతారాజుపల్లి మాజీ సర్పంచ్ మంద బాబురావు, మాల మహానాడు జిల్లా నాయకుడు డాక్టర్ తుప్పరి నరసింహస్వామి, మనుగొండ మాదాసి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనపీర్‌యిల్ అంబేడ్కర్ నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందెల సునీల్‌ను ఎన్నుకోగా, సభ్యులుగా దక్క ప్రభాకర్, మాదాసి రాంబాబు, మంద బాబురావు, మాదాసి బిక్షపతి, కొమ్ముల సురేందర్, డాక్టర్ తుప్పరి నరసింహస్వామిని ఎన్నుకున్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
18 మంగళవారం ఆగస్టు 2026

# పాలిటెక్నిక్ విలీనంపై స్పష్టత ఇవ్వాలి

## మౌలిక వసతులు కల్పించాలి.. లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

పరకాల, ఆగస్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పరకాల పాలిటెక్నిక్ కళాశాల ఎదుట చేపట్టిన ఆందోళనలో విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించాలని, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. శక్తి పాలసీని వెనక్కి తీసుకోవడంతో పాటు ఎస్బీటీఈటీని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలల్లో హాస్టళ్లు,





ప్రయోగశాలలు, భవనాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని, అధ్యాపకులు, సిబ్బంది సర్వీస్ నిబంధనలకు రక్షణ కల్పించాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కళ్యాణ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలల అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొచ్చు ఈశ్వర్, పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, నాయకులు ప్రశాంత్, నాగరాజ్, అభినవ్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై స్పష్టత ఇవ్వాలి
## వినయ్ భాస్కర్

హనుమకొండ, ఆగస్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లుగా కాలయాపన చేస్తోందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వినయ్ భాస్కర్ కోరారు. ఈ పథకాలకు సంబంధించి న్యాయస్థానంలో వ్యవహారం పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయడం లేదని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని హెచ్చరించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చారని ఆయన తెలిపారు. దళితబంధు వంటి పథకాలతో పేదలు, దళిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలనే ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం బీఆర్ఎస్ ఉద్యమించి సాధించిందని తెలిపారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ప్రజల నుంచి ప్రభుత్వానికి తీవ్ర వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు.

### పరకాలకు ఏం చేశారు?: చల్లా

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను విమర్శించడం తప్ప ప్రస్తుత ప్రభుత్వం పరకాల నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలోనే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు వచ్చాయని తెలిపారు. రైతులకు సకాలంలో యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పరకాలలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారని ఆరోపించారు. ప్రజాధనాన్ని ఖర్చు చేసే కార్యక్రమాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు.





# పాపన్న చరిత్రకు మరింత గుర్తింపు

## పాఠ్యాంశాల్లో చోటు.. ట్యాంక్‌బండ్‌పై విగ్రహం.. కోటలను పరిరక్షించాలి

హనుమకొండ, ఆగస్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చరిత్రకు అధికారిక గుర్తింపు లభిస్తున్న నేపథ్యంలో ఆయన జీవిత చరిత్ర, ప్రజా పోరాటం, జానపద సాహిత్యంపై మరింత విస్తృతంగా పరిశోధనలు జరగాలని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం బీవోఎస్ చైర్మన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిర్ర రాజు గౌడ్ అన్నారు. ఆగస్టు 18న పాపన్న జయంతి సందర్భంగా ఆయన చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే చర్యలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సామాన్య ప్రజలను సంఘటితం చేసి అప్పటి పాలక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్నగౌడ్ తెలంగాణ సామాజిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. పాపన్న వీరత్వం, ప్రజా పోరాటాన్ని తరతరాలకు అందించడంలో జానపద కళాకారులు, గాయకుల పాత్ర కీలకమన్నారు. తెలంగాణతో పాటు దక్షిణాది ప్రాంతాల్లో పాపన్నకు సంబంధించిన జానపద గేయాలు, కథనాలు ప్రచారంలో ఉన్నాయని పేర్కొన్నారు. పాపన్న చరిత్రకు పాఠ్యాంశాల్లో స్థానం కల్పించడం ప్రాధాన్యమైన పరిణామమని డాక్టర్ రాజు గౌడ్ అన్నారు. తెలంగాణ పాఠ్యాంశాల్లో ఆయన చరిత్రను పొందుపరచడంతో పాటు కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు పీజీ పాఠ్యాంశాల్లో పాపన్నకు సంబంధించిన సాహిత్యాన్ని చేర్చడం ద్వారా విద్యార్థులకు ఆయన చరిత్రను అధ్యయనం చేసే అవకాశం ఏర్పడిందన్నారు. పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### చారిత్రక కట్టడాలను కాపాడాలి

పాపన్నగౌడ్‌కు సంబంధించిన చారిత్రక కట్టడాలను శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షించాలని డాక్టర్ రాజు గౌడ్ కోరారు. ఖిలాషాపూర్, తాటికొండ తదితర ప్రాంతాల్లోని చారిత్రక ఆనవాళ్లను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. దీనివల్ల తెలంగాణ చరిత్ర, సంస్కృతిని దేశ, విదేశీ పర్యాటకులకు పరిచయం చేసే అవకాశం ఉంటుందన్నారు. పాపన్న జీవిత చరిత్రతో పాటు ఆయనకు సంబంధించిన జానపద సాహిత్యాన్ని సేకరించి శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని కోరారు. పాపన్న చరిత్రను ఒక సామాజిక వర్గానికి మాత్రమే పరిమితం చేయకుండా తెలంగాణ సామాజిక, సాంస్కృతిక చరిత్రలోని ముఖ్యమైన అధ్యాయంగా అధ్యయనం చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు.



## గరుడ గంగ మంజీరా పుష్కర ఘాట్ తీరాన ఘనంగా నాగ పంచమి వేడుకలు

## : దేవాలయ వ్యవస్థాపకులు దొర్బల రాజమౌళి శర్మ

మెదక్,ఆగస్టు17(హైద్రాబాద్ ఎస్టేట్):మెదక్ మండల పరిధిలోని పేరూరు మంజీరా నది సమీపంలో స్వయంభుగా వెలసిన శ్రీ సరస్వతీ దేవాలయంలో స్వయంభుగా వెలసిన నాగమాతృక(పుట్ట)కు నాగ పంచమి సందర్భంగా మెదక్ మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు ఉదయం నుండే ఆలయానికి పోటెత్తి ప్రత్యేక పూజలు నిర్వహించి,అమ్మవారి దర్శన భాగ్యం చేసుకున్నారు.
గరుడ నాగ పంచమి సందర్భంగా
25వసంతాల వేడుకల్లో భాగంగా భక్తుల కోలాహలం మధ్యలో నాగ మాతకు పంచామృత అభిషేకం,పుట్టలో పాలు పోయుట,అలంకరణ, ఒడిబియ్యం,మహానైవేద్యం,సర్ప,స్వప్న,దోష, కాల సర్ప దోష నవనాగ హోమం,నివారణ పూజ కార్యక్రమాలు,పూర్ణాహుతి,గోమాతృక, సరస్వతీ మాతృక అర్చనలు,గరుడ గంగ,మహా హారతి,మంత్ర పుష్పం,తీర్థ ప్రసాద వితరణ బ్రాహ్మణ ఆశీర్వాదములు భక్తులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రధాన పూజారి దొర్భల మహేష్ శర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించి జనమే జయ మహారాజు సర్పయాగం చేసిన భూమి లో లభించిన విభూతిని ధరించి శ్రీ సరస్వతీ మాత




సప్తముఖ నాగ మాతృక అమ్మవార్లను భక్తులందరూ తరించి దర్శించారు.ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాలు కల్పించారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

## - పాత్రికేయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
## - మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



హైదరాబాద్, ఆగస్టు 17: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు.సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు.కేబుల్, ఐపీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ ఇవ్వాలిరాష్ట్రంలోని అన్ని కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. అదేవిధంగా ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారిత న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేబుల్ ఛానళ్లకు జిల్లాస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

### జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు

అక్రెడిటేషన్ కార్డులు మంజూరవుతున్నప్పటికీ జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫెడరేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రత్యేకంగా సహాయం, సంక్షేమ చర్యలు అందించాలని కోరారు.

### ప్రకటనల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చిన్న, మధ్యతరహా పత్రికలకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌లో చేర్చి వాటి మనుగడకు సహకరించాలని కోరారు.
రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్‌సీనియర్, రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. జర్నలిస్టుల పిల్లలు ఎంతవరకు చదువుకున్నా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది.అలాగే జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం అందించే విధంగా పథకాన్ని అమలు చేయాలని కోరారు.జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు.మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్.రవికుమార్ తదితరులు ఉన్నారు.

# అనంతబాబుకు చుక్కెదురు

## శాసనమండలి సమావేశాలకు హాజరయ్యేందుకు బెయిల్ కోరిన పిటిషన్ తిరస్కరణ



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి రాజమండ్రి, ఆగస్టు 17, 2026: డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కర్ (అనంతబాబు)కు రాజమండ్రి జిల్లా కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలకు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరుతూ అనంతబాబు దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను రాజమండ్రి జిల్లా కోర్టు తిరస్కరించింది.
శాసనమండలి సమావేశాలకు హాజరై తన బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉందని పేర్కొంటూ అనంతబాబు తరఫు న్యాయవాదులు కోర్టులో బెయిల్ కోసం అభ్యర్థించారు. అయితే ఈ అభ్యర్థనను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ల సుబ్బారావు తీవ్రంగా వ్యతిరేకిస్తూ కోర్టులో వాదనలు వినిపించారు.కేసు విచారణ కీలక దశలో ఉన్నందున నిందితుడికి బెయిల్ మంజూరు చేయడం వల్ల కేసు విచారణపై ప్రభావం పడే అవకాశం ఉందని, సాక్షులపై ఒత్తిడి లేదా ప్రభావం చూపే పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ల సుబ్బారావు కోర్టు దృష్టికి తీసుకువచ్చినట్లు సమాచారం.అనంతబాబు శాసనమండలి సమావేశాలకు హాజరు కావాలనే కారణంతో మాత్రమే మధ్యంతర బెయిల్ మంజూరు చేయలేమని కోర్టు అభిప్రాయపడుతూ ఆయన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో న్యాయ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో కోర్టు తాజా నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. సాక్షులను ప్రభావితం చేసే అవకాశం లేకుండా కేసు విచారణ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి.
డా. పిట్టా వరప్రసాద్ మాట్లాడుతూ:
“చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమే. శాసనమండలి సభ్యుడిగా ఉన్నంత మాత్రాన న్యాయ ప్రక్రియ నుంచి మినహాయింపు లభించదు. తీవ్రమైన హత్య కేసులో న్యాయ విచారణ కొనసాగుతున్న సమయంలో సాక్షుల రక్షణ, నిష్పక్షపాత విచారణ అత్యంత ముఖ్యమైన అంశాలు. ఈ నేపథ్యంలో అనంతబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించడం సముచిత నిర్ణయం.”“అనంతబాబు బెయిల్‌ను వ్యతిరేకిస్తూ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ల సుబ్బారావు బలమైన వాదనలు వినిపించడం అభినందనీయం. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కేసు విచారణను ఎలాంటి రాజకీయ, ఇతర ఒత్తిళ్లకు తావులేకుండా వేగంగా పూర్తి చేయాలి. సాక్షులకు పూర్తి రక్షణ కల్పించాలి” అని డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.
డా. పిట్టా వరప్రసాద్
రాష్ట్ర అధ్యక్షులు
రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్)
ఆంధ్రప్రదేశ్

# విద్యార్థులు లక్ష్యంతో చదివి

## ఉన్నత స్థాయికి ఎదగాలి

## : కలెక్టర్ గరిమ అగ్రవాల్

## కేజీబీవీలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి సదానంద్ వేములవాడ

వేములవాడ పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ తమ భవిష్యత్ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కిచెన్‌ను సందర్శించి కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, పప్పులు, బియ్యం తదితర నిత్యావసర సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. వాటి గడువు తేదీలను పరిశీలించడంతో పాటు, మెనూ చార్ట్ ప్రకారం ఆ రోజు విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో వారితో కలెక్టర్ మాట్లాడి, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా? భోజనం రుచిగా ఉంటుందా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ తరగతి గదిని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి భవిష్యత్ ప్రణాళికలు, ఉన్నత విద్య, ఉద్యోగ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే పాఠ్యాంశాలను ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు. అన్ని పాఠ్యాంశాలపై ప్రశ్నాపత్రాలను సాధన చేస్తూ పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, దానిని సాధించే దిశగా కష్టపడి చదవాలని సూచించారు. భవిష్యత్‌లో తాము కోరుకున్న ఉద్యోగాల్లో స్థిరపడటంతో పాటు స్వయం ఉపాధి రంగంలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

అలాగే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యాలయంలో అందించే పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.

# తాడు ఆట పేరుతో భక్తులకు టోకరా..

## ఇద్దరు అరెస్ట్

### వేములవాడలో జూదం నిర్వహిస్తున్న

### ఇద్దరిని రిమాండ్‌కు తరలింపు




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి సదానంద్ వేములవాడ

శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకుని "తాడు ఆట" పేరుతో జూదం నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరిని వేములవాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.హనుమకొండ జిల్లా ఐనవోలు గ్రామానికి చెందిన రాయపురం సురేందర్ (42), ఆత్మకూరు గ్రామానికి చెందిన పల్లకొండ దేవేందర్ (33) భక్తులు అధికంగా వచ్చే ప్రాంతాన్ని ఎంచుకుని తాడు ఆట పేరుతో జూదం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.దీంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి, తాడు ఆట నిర్వహిస్తున్న ప్రదేశంపై దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి తాడు ఆటకు ఉపయోగించే సామగ్రి, అప్సర పెన్సిళ్లు, రూ.2,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. అక్రమ కార్యకలాపాలను సహించేది లేదుభక్తులు అధికంగా వచ్చే ప్రాంతాల్లో అమాయక భక్తులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడటం, జూదం నిర్వహించడం, ఇతర చిన్నచిన్న నేరాలకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సీఐ వీరప్రసాద్ స్పష్టం చేశారు. ప్రజలు, భక్తులు ఇలాంటి అక్రమ కార్యకలాపాలను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

# 97 జీవో రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నిరసన

## .సాంకేతిక విద్యను కాపాడాలి..

## శక్తి పాలసీని వెంటనే రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ




రాజన్న సిరిసిల్ల:

ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజరాజేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ఎదుట జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని శక్తి పాలసీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, విద్యార్థుల ప్రయోజనాలకు ఇబ్బంది కలిగించే విధానాలను తీసుకురావడం సరికాదన్నారు."శక్తి వద్దు.. సాంకేతిక విద్య ముద్దు", "శక్తి పాలసీని వెంటనే రద్దు చేయాలి.. పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి" అంటూ నినాదాలు చేశారు.జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కల్యాణలక్ష్మి కొనసాగాల్సిందే.. సబితా ఇంద్రారెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 17:-

మహేశ్వరం: పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కల్యాణలక్ష్మిషాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు ఆర్థికంగా భారంగా మారుతున్న పరిస్థితులను గుర్తించి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకాల ద్వారా అనేక పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందుతూ అండగా నిలుస్తోందన్నారు.అయితే ప్రస్తుత ప్రభుత్వం పథకాన్ని బలోపేతం చేయాల్సిన సమయంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆమె ఆరోపించారు. లబ్ధిదారులకు చెల్లించాల్సిన మొత్తాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన తులం బంగారం హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.కల్యాణలక్ష్మిషాదీ ముబారక్‌కు సంబంధించిన కోర్టు వ్యవహారంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి పేదల ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పథకాలను నిలిపివేసే ప్రయత్నాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. పేదింటి ఆడబిడ్డలకు న్యాయం జరిగే వరకు పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మిని నిలిపివేసే కుట్రలను తిప్పికొడతాం

## : మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిశి

## పేదింటి ఆడబిడ్డల పెళ్లికి అండగా నిలిచిన పథకాన్ని కొనసాగించాలి..



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్

కాంగ్రెస్ ప్రభుత్వంపై కక్షపూరిత వైఖరిని వీడాలి

చండూరులో మహిళలతో కలిసి భారీ ధర్నా..

నడిరోడ్డుపై బైఠాయించి నిరసన

చండూరు పట్టణ కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పరిరక్షణ కోసం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, పార్టీ కార్యకర్తలతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నడిరోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారకూడదనే గొప్ప సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చారని అన్నారు.

2014 అక్టోబర్ 2న ప్రారంభమైన కల్యాణలక్ష్మి పథకం తొలుత రూ.50 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమై, అనంతరం రూ.1,00,116కు పెరిగి లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిందని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లి అంటే తల్లిదండ్రులు అప్పులపాలు కావాల్సిన పరిస్థితిని మార్చేందుకు కేసీఆర్ ఎంతో దూరదృష్టితో ఈ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. తెలంగాణలోని లక్షలాది కుటుంబాల జీవితాల్లో కల్యాణలక్ష్మి వెలుగులు నింపిందని అన్నారు.

ఒక నియోజకవర్గంలోనే ప్రతి సంవత్సరం సుమారు 3,500 మంది వరకు కల్యాణలక్ష్మి లబ్ధిదారులు ఉంటారని, ఇలాంటి పథకం పేదలకు ఎంత అవసరమో దీన్నిబట్టే అర్థం చేసుకోవచ్చన్నారు. పేద కుటుంబాల ఆడబిడ్డలకు అండగా నిలిచిన ఈ పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ వైఖరిపై అనుమానాలు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రభాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలకు సంబంధించి కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత కూడా ప్రభుత్వం తరఫున సమర్థవంతంగా న్యాయపోరాటం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

పేదల కోసం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కోర్టులో పథకం తరఫున బలమైన వాదనలు వినిపించి, పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలి.

ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున న్యాయపోరాటానికి సిద్ధంగా ఉంది" అని ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలపై నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం తక్షణమే న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ పార్టీ తరఫున న్యాయవాదులతో కలిసి హైకోర్టులో న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

రాజగోపాల్‌రెడ్డిపై ప్రభాకర్‌రెడ్డి తీవ్ర విమర్శలు

స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై కూడా ప్రభాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాజగోపాల్‌రెడ్డి రోజుకో రకమైన ప్రకటన చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఒకరోజు మంత్రి పదవి కావాలని, మరోరోజు పదవులు అవసరం లేదని, ఇంకో రోజు ప్రభుత్వంపై పోరాటం చేస్తానని మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికార పార్టీలో ఉండి ప్రతిపక్ష నేతలా మాట్లాడటం రాజగోపాల్‌రెడ్డికే చెల్లింది. కల్యాణలక్ష్మిపై కోర్టు ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో పేదల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదు?" అని ప్రభాకర్‌రెడ్డిని ప్రశ్నించినట్లు ఆయన అన్నారు. ప్రజల సమస్యలపై రాజగోపాల్‌రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోనే మునుగోడుకు అభివృద్ధి

తన హయాంలో మునుగోడు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

చౌటుప్పల్, చండూరు రెవెన్యూ డివిజన్లు, మర్రిగూడ, చౌటుప్పల్‌లో ఆసుపత్రులు, పైలాన్ పార్క్, వందల కోట్ల రూపాయలతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, మండలాల అంతర్గత రహదారులు, శివన్నగూడెం ప్రాజెక్టు, చండూరులో వివిధ రహదారి అభివృద్ధి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు.

మంత్రి పదవి వస్తేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందనుకోవడం సరికాదు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రజల కోసం పనిచేసే చిత్తశుద్ధి ఉండాలి. పదవులు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల సమస్యలే ముఖ్యమని గుర్తించాలి" అని ప్రభాకర్‌రెడ్డి అన్నారు.ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో తెలంగాణ ప్రజలు, మునుగోడు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణకు, రాజగోపాల్‌రెడ్డి మునుగోడు నియోజకవర్గానికి అరిష్టంగా మారారని ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

ఇప్పటికైనా రాజగోపాల్‌రెడ్డికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, పేద కుటుంబాల తరఫున న్యాయపోరాటం చేయాలని ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పేదల సంక్షేమ పథకాలను కాపాడే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## మునిసిపల్ కమిషనర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్



హైదరాబాద్ ఎస్టేట్ 17ఆగస్టు

రామకృష్ణాపూర్ క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కాంగ్రెస్ పార్టీరామకృష్ణాపూర్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి, అక్కడ నివసిస్తున్న లబ్ధిదారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీరామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు ప్రధానంగా డ్రైనేజీ సమస్య, రోడ్ల సమస్య, తాగునీటి ఇబ్బందులు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, చెట్ల పొదలు తొలగించడం, ప్రహరీ గోడ నిర్మాణం వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. 2019లో అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించి, సుమారు రూ.15 కోట్ల వ్యయంతో 2022లో నిర్మాణాన్ని పూర్తి చేసినప్పటికీ, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించడంలో జాప్యం జరిగిందని పేర్కొన్నారు. దీంతో కొంతకాలం ఇళ్లు ఖాళీగా ఉండటంతో కిటికీలు, తలుపులు, వాటర్ ట్యాంకులు, స్ట్రీట్ లైట్లు తదితర సదుపాయాలు శిథిలావస్థకు చేరడంతో పాటు, ఆ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని తెలిపారు. 2023లో చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ఎన్నికైన అనంతరం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మరమ్మతులు చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. తమ విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి రూ.27 లక్షల నిధులు మంజూరు చేయించి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆ తర్వాత 2025లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా గౌరవ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందించేలా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. క్యాతనపల్లి మునిసిపాలిటీ లో పాలకవర్గశీ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడుతుందని , ప్రజలకు సంబంధించిన సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవి పరిష్కారం అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు, కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, పల్లె శ్రీదేవి, మాజీ జెడ్పిటిసి యాకూబ్ అలీ, మాజీ చైర్ పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, సృజన, ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి రాజేష్ నాయకులు కొక్కుల సతీష్, కట్ల రమేష్, నక్క శ్రీనివాస్, మస్కం సంపత్, నాగుల రాజ్ కుమార్, జోగుల వెంకటేశ్వర్లు, నేరెళ్ల చంద్రయ్య, రాంసాయి , శంకర్, రాజు మహిళా నాయకులు రాజేశ్వరి, దీప, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ఆడబిడ్డల పథకాలను నిర్వీర్యం చేస్తే ఊరుకోం.. బీఆర్ఎస్ మహిళా నాయకుల హెచ్చరిక

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పరిరక్షణకు వేములవాడలో నిరసన..

## తెలంగాణ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ





కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు వేములవాడ పట్టణంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు నిరసన చేపట్టారు. వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశాల మేరకు తెలంగాణ చౌక్‌లో నిరసన అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. "ఆడబిడ్డ భారం కాదు.. భరోసా" అనే ఆలోచనతో అమలు చేసిన ఈ పథకాలు ఎంతోమంది పేద కుటుంబాలకు అండగా నిలిచాయని తెలిపారు.

పథకాలను రద్దు చేయడం లేదా నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తే తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ.. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ద

పేదింటి ఆడబిడ్డల వివాహానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా సక్రమంగా అమలు చేయాలని కోరారు. కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కూడా వారు ప్రశ్నలు లేవనెత్తారు.

హైకోర్టు పలుమార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డలకు సంబంధించిన ఈ కీలక అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పకడ్బందీగా కొనసాగించి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏనుగు జ్యోతి, వాసాల లావణ్య, వెంగల అనిత, బీఆర్ఎస్ మహిళా నాయకులు, పట్టణ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కులగణనలో ఓబీసీలను ప్రత్యేకంగా నమోదు చేయాలి

## - చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి..

## - కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

## - ఎంపీ రవిచంద్ర




న్యూఢిల్లీ, ఆగష్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: దేశ జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న ఓబీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా లెక్కల సేకరణలో కులగణన చేపడుతున్న నేపథ్యంలో ఓబీసీలను ప్రత్యేక కేటగిరీగా నమోదు చేసి, వారి వాస్తవ జనాభాను శాస్త్రీయంగా, పారదర్శకంగా లెక్కించాలని కోరారు. సోమవారం ఢిల్లీలో ఆయన ప్రకటన విడుదల చేశారు. కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు రవిచంద్ర తెలిపారు. అయితే ఓబీసీలకు సంబంధించిన సమగ్ర వివరాలు అందుబాటులోకి వచ్చినప్పుడే వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రిజర్వేషన్లు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఓబీసీల వివరాల నమోదులో ఎలాంటి అస్పష్టతకు తావివ్వకుండా స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని సూచించారు. 1931లో బ్రిటిష్ పాలనలో కులగణన జరిగిందని, దశాబ్దాల తర్వాత మళ్లీ ఈ ప్రక్రియ చేపడుతున్నందున ఓబీసీల జనాభా వివరాల సేకరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే ఓబీసీలను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, వారి జనాభా, సామాజికఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారాన్ని సేకరించాలని కేంద్రాన్ని కోరారు. చట్టసభల్లో మహిళలతో పాటు ఓబీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 2014 జూన్ 14న అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేసిన విషయాన్ని రవిచంద్ర గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీఆర్ఎస్ పార్లమెంటులో, బయట పోరాడిందని తెలిపారు. ఓబీసీల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యానికి కేంద్రంలో ప్రత్యేకంగా ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని రవిచంద్ర డిమాండ్ చేశారు. ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# కుల వివక్ష,పేదరిక నిర్మూలన కోసం ఉద్యమిద్దాం



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు17
మహేశ్వరం: పేదరిక నిర్మూలన, అణగారిన వర్గాల ఆర్థిక ఎదుగుదల కోసం మత దురహంకారం, కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా ఉద్యమిస్తామని ఎం.ఆర్.పి.ఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలోని జేమ్లా నాయక్ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఎం.ఆర్.పి.ఎస్, అనుబంధ విభాగాల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం ఎం.ఆర్.పి.ఎస్ మహేశ్వరం మాజీ అధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాగల్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ, దేశంలో కొనసాగుతున్న కుల వ్యవస్థ కారణంగానే అణగారిన వర్గాలు పేదరికంలోనే మిగిలిపోయాయని అన్నారు. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న కుల వివక్షను నిర్మూలించి, దోపిడీ, వివక్ష, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గౌతమ బుద్ధుడు, సంత్ రవిదాస్, మహాత్మా జ్యోతిరావు ఫూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్ రామ్, కాన్షీరామ్ వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. మాదిగలతో పాటు పేదరికంలో ఉన్న అన్ని అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం రాజకీయ చైతన్యంతో ఉద్యమించాలని సూచించారు. ఎం.ఆర్.పి.ఎస్ ను సంస్థాగతంగా బలోపేతం చేయడంలో భాగంగా అన్ని గ్రామాల్లో నూతన కమిటీల నిర్మాణ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. చదువుకున్న యువత, విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఎం.ఆర్.పి.ఎస్ తో పాటు ఎం.ఎస్.పి, ఎంఎస్ఎఫ్ తదితర అనుబంధ విభాగాలకు నూతన గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సెప్టెంబర్ 9న నిర్వహించనున్న ఛలో వరంగల్ ఎం.ఆర్.పి.ఎస్ మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.పి జిల్లా మాజీ అధ్యక్షుడు రావుగళ్ల బాబూ మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు డా.జంగన్న మాదిగ, ఎం.ఎస్.ఎఫ్ ఇన్‌చార్జి ఆదిరాల భరత్ మాదిగ, శేఖర్ మాదిగ, స్వామి మాదిగ, కుమార్ మాదిగ, కిన్నెర రాజు, ఏలేటి వెంకటేష్, గోల్లూరి మల్లేష్, నరేష్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంగదేవిపల్లిలో ఆరోగ్య పరీక్షలు

## ముందస్తు వ్యాధుల గుర్తింపుపై అవగాహన



గీసుగొండ, ఆగష్టు 17 హైదరాబాద్ ఎస్టేట్: గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిలో ఆరోగ్య పరీక్షల కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కూసం స్వరూప్‌రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన సూచనలు, వైద్య సలహాలు అందించారు. ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ముందస్తు పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజు, డాక్టర్ స్వాతి, ఏఎన్ఎంలు వినోద, సుహాసిని, ఎంపీహెచ్ఏ(ఎం) జె.శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు కె.పద్మ, స్వప్న, అమల, నర్మద, రాధిక, నాగమణి పాల్గొని గ్రామస్థులకు ఆరోగ్య సేవలు అందించారు.







